ప్రమాదాల మలుపులు


పట్టాభిరెడ్డితోట రహదారిలో ప్రమాదకర మలుపు


సూర్యానగర్ రహదారిలో ప్రమాదకర మలుపు

- మురళీనగర్ పరిసరాల్లో నిత్యం ప్రమాదాలు
- స్పీడ్ బ్రేకర్లున్నా కనిపించని పరిస్థితి
- నేటికీ రంగులు వేయని సిబ్బంది


రామాలయం వెనుక రహదారి మలుపు

మురళీనగర్ : మురళీనగర్ పరిసరాల్లో రహదారులు ప్రమాదకరంగా తయారయ్యాయి. ప్రధాన రహదారులతోపాటు కాలనీలను అనుసంధానించే రహదారుల మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా వీటి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.


ఏఎస్ఆర్‌నగర్ వద్ద ప్రమాదకర మలుపు

ఇది నిరంతర సమస్యగా తయారైంది. కొన్ని మలుపుల వద్ద స్పీడు బ్రేకర్లున్నా అవి కనిపించని విధంగా ఉన్నాయి. వీటికి జీబ్రా కలర్ వేయకపోవడం వల్ల వాహన చోదకులు దగ్గరికి వచ్చేవరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగి గాయాలపాలవుతున్నారు.

ఒక్కో చోట ఒక్కో రకంగా...

మురళీనగర్ పరిధిలో మాధవధార 48వ నంబరు బస్సు రహదారి, బిర్లా కూడలి – మురళీనగర్ రహదార్లు ప్రధానమైనవి. వీటిని అనుసంధానిస్తూ కాలనీలకు రోడ్లు నిర్మించారు. అయితే ఈ రోడ్లు కలిసే చోట ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మురళీనగర్ ప్రధాన రహదారి నుంచి మాధవధార రహదారిని కలిపే కూడలిలో దగ్గరకు వెళ్లే వరకు వాహనాల రాకపోకలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇక్కడి ప్రమాదకర మలుపు వల్ల ఎటు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియక అయోమయ పరిస్థితిలో వాహన చోదకులు వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో అనేక సార్లు ప్రమాదాలు జరిగి వాహన చోదకులు తీవ్ర గాయాలపాలైన సంఘటనలు న్నాయి. మాధవధార రహదారిలో తెన్నేటినగర్‌ను కలిపే అనుసంధాన రహదారి కూడలి వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అకస్మాత్తుగా వాహనాలు వేగంగా రావడంతో కాలనీల నుంచి ఈ ప్రధాన రహదారికి చేరుకునే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మాధవధార రహదారిని ఆనుకుని వైశాఖి స్పోర్ట్స్ పార్కు, వాకర్స్ పార్కు, ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు, తెన్నేటి పార్కులకు వెళ్లే అనుసంధాన రహదార్ల మలుపులు ఉన్నాయి. ముఖ్యంగా తెన్నేటినగర్ అనుసంధాన రహదారి కలిపే చోట ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

కాలనీల్లోనూ అదే పరిస్థితి

ఎన్‌జీజీవోస్ కాలనీ నుంచి సీతమ్మధార వెళ్లే మార్గం డౌన్‌లో స్పీడుగా వాహనాలు రావడం వల్ల ప్రమాదకరంగా తయారయ్యింది. ఈ డౌన్లో బార్ అండ్ రెస్టారెంట్ ఉంది. దీంతో రహదారిపై జనం ఎక్కువగా ఉంటున్నారు. ఏ వాహనం ఎవరిని ఢీకొంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక పట్టాభిరెడ్డితోట నుంచి సూర్యానగర్, సత్యానగర్ వెళ్లే రహదారి వద్ద పాము మెలికల్లా మలుపులు ఉన్నాయి. దాసాంజనేయస్వామి ఆలయం వద్ద మినహా ఇతర చోట్ల స్పీడ్ బ్రేకర్లు లేవు. దగ్గరికి వెళ్లే వరకు ఎదురుగా వాహనం కనిపించదు. పైగా ఇక్కడ వీధిలైట్లు సరిగ్గా వెలగడం లేదు. వెలిగే లైట్లు కూడా పొదల్లో ఉండిపోవడం వల్ల రహదారిపై వెలుగులు ప్రసరించడం లేదు. జంగిల్ క్లియరెన్స్ చేయడంలో శానిటరీ సిబ్బంది విఫలమవుతున్నారు. మురళీనగర్ రామాలయం నుంచి 11, 13 సెక్టార్లకు వెళ్లే అనుసంధాన రహదార్లు మలుపుల్లో ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదాలకు గురవ్వాల్సిందే. మాధవ యువజన సమాజం సమీపంలో మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి.

స్పీడ్ బ్రేకర్లున్నా ప్రయోజనం శూన్యం

చాలా చోట్ల స్పీడ్ బ్రేకర్లు వేసినా నిరుపయోగమవుతున్నాయి. స్పీడ్ బ్రేకర్లు వేసి చేతులు దులుపుకుంటున్న సిబ్బంది వాటికి తెలుపు రంగు, జీబ్రా చారలు వేయడం లేదు. దీంతో రాత్రి పూట అవి రహదారి రంగులో కలిసిపోయి వాహన చోదకులు ఏమాత్రం వేగంగా వచ్చినా భారీ ప్రమాదాలు జరుగుతున్నాయి. సీఐఎస్ఎఫ్ క్వార్టర్ల మలుపులో వేసిన రంగులు వెలిసిపోయి ఏడాదైనా పట్టించుకునే నాథుడే లేడు. ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. దీనిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాల్సి ఉంది. సత్యానగర్ నుంచి ఊర్వశి కూడలి వరకు సర్వీసు రహదారిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.


సీఐఎస్ఎఫ్ సమీపంలో రహదారి మలుపులో వెలిసిపోయిన రంగులు

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ


రగ్గులు అందిస్తున్న కీర్తి పట్నాయక్

మురళీనగర్ : ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న నిరాశ్రయులకు శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ దుప్పట్లు పంపిణీ చేసింది. ట్రస్టు చైర్‌పర్సన్ కుప్పిలి కీర్తి పట్నాయక్ ఆధ్వర్యంలో జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసరాల్లోని ఫుట్‌పాత్‌లపై జీవిస్తున్న మహిళలు, వృద్ధులు, యాచకులను చలి నుంచి కాపాడేందుకు రగ్గులు, దుప్పట్లు అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు టీవీ చారి, మనీషా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం


అన్నప్రసాదం అందిస్తున్న రాజశేఖర్

సీతంపేట : అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాల ప్రాంగణంలో నిరుపేదలకు ఆదివారం అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఎస్.ఎల్.శైలజ ముఖ్య అతిథులుగా అన్న ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, గత 13 ఏళ్లుగా ప్రతి ఆదివారం 200 మంది పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అన్నదానం చేస్తున్న శైలజ, సత్యనారాయణ, జి.బి.కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాస్, ఎం.సూర్యారావు, శ్రీమంత్‌కుమార్ పాల్గొన్నారు.

శాంతితోనే దేశాభివృద్ధి


మాట్లాడుతున్న డీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ దివాకర్

సీతంపేట : దేశ అభివృద్ధి శాంతిపై ఆధారపడి ఉందని డీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.దివాకర్ అన్నారు. బీవీ ఫౌండేషన్, ఐఏఆర్ఎఫ్ సంయుక్తంగా బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో క్రిస్మస్ సందర్భంగా మత సామరస్యంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవం అంటే కృతజ్ఞతకు చిహ్నమని, ప్రతి క్రైస్తవుడు సమాజంలో మంచి మనస్సు కలిగి ఉండాలన్నారు. క్రీస్తు బోధనలు ఆచరిస్తే యుద్ధాలు నివారించగలమన్నారు. డాక్టర్ సత్యమూర్తి, డాక్టర్ ప్రజ్ఞాన్‌కుమార్, బ్రహ్మకుమారి రమా మాట్లాడుతూ యుద్ధాల నివారణకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, ఉషారాణి, జోగారావు, గౌరి, బెనర్జీ, సీతల్, సత్యవతి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టోరీ టెల్లింగ్


జపనీస్ విధానంలో కథను బోధిస్తున్న కథకురాలు వరలక్ష్మి

సీతంపేట : స్థానిక ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన మియావాకీ స్టోరీ టైం చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ సర్టిఫికెట్ కథకురాలు ఆర్.వరలక్ష్మి తనదైన శైలిలో కథలు చెప్పి విద్యార్థులను ఉత్సాహపరిచారు. తుంటూ అనే పక్షి గురించి బెంగాలీ జానపద కథను, అలాగే కామిషిబాయి జపనీస్ కథ విధానంలో వాయిస్ మాడ్యులేషన్, హావభావాలతో చక్కగా బోధించి ఆకట్టుకున్నారు. కథలో చిన్న చిన్న పాటలను పిల్లలు అనుకరించి పాడేలా ప్రోత్సహించారు. కథ కథనాన్ని అనుసరించి, కథతోపాటు పిల్లల పుస్తకాలు, రచయితల ఆధారంగా క్విజ్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 60 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్కేటింగ్ విజేతలకు అభినందన

సీతంపేట : ఇటీవల తమిళనాడు రాష్ట్రం పోలచ్చిలో జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్‌లో పతకాలు సాధించిన సబ్బవరపు శంకర్, బి.కార్తీక శరణ్య, లోహిత్ రెడ్డి సీతంపేటలోని జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కేటింగ్ కోచ్‌లు పి.సత్యనారాయణ, కె.చిట్టిబాబు పాల్గొన్నారు.

రక్తదానాన్ని అలవాటుగా మార్చుకోవాలి

సీతమ్మధార : నేటి యువత రక్తదానం చేయడం ఒక అలవాటుగా మార్చుకోవాలని రోటరీ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చెరుకుమిల్లి కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ద్వారకానగర్ – 3లోని రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో ఎయిర్ అండ్ గ్యాస్ భవనంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లగా రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తోందని తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యులతోపాటు గుడ్ ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్, విశాఖ రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన 200 మంది రక్తదానం చేశారు. దాతలకు రోటరీ బ్లడ్ బ్యాంక్ సర్టిఫికెట్లు అందజేసింది. క్లబ్ గ్రేటర్ విశాఖ అధ్యక్షుడు ఎండి యాసిన్ బాబా, కార్యదర్శి చింత నేతాజీ, జీకే మూర్తి, విజ్జపు ప్రవీణ్ కుమార్, బచ్చు బ్రహ్మానందం, పి.వెంకట కృష్ణ, చంద్రమౌళి పట్నాయక్, వి.కామేశ్వరరావు, వై.పరసయ్య, డి.తారకేశ్వరరావు, ఎండీ యామిన్, వి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

ఎస్టేట్ ఆఫీసర్‌కు సత్కారం


రైతుబజారులో ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబుతో రైతులు

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబును ఆదివారం రాత్రి రైతులు ఘనంగా సత్కరించారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఇక్కడ పని చేసిన ఆయన ప్రతి ఒక్కరితోనూ స్నేహంగా మెలిగేవారని రైతులు కొనియాడారు. అనంతరం కొండబాబుకు రైతులు పూలదండ వేసి ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో బజారు సహాయకుడు సతీష్, రైతులు సంతోష్, అప్పలనాయుడు, నగ్మా, అమ్మాజీ, చిన్ని, రమణమ్మ, లక్ష్మి, శబరి, సత్యవతి, భాగ్యలక్ష్మి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు పరిరక్షిస్తా


బాధ్యతలు స్వీకరిస్తున్న ఆత్మకూరు సత్యనారాయణ

సీతమ్మధార : ఫోర్తుటౌన్ సీఐగా ఆత్మకూరు సత్యనారాయణ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆయన మహారాణిపేట స్టేషన్ (ఎంఆర్‌పేట), అనకాపల్లి రూరల్, బుచ్చయ్యపేట, ఎ.అన్నవరం, ఎ.కోడూరు, మునగపాక ప్రాంతాల్లో ఎస్ఐగా పని చేశారు. 2021లో సీఐగా పదోన్నతి వచ్చింది. జి.మాడుగుల సర్కిల్‌లో మొదటి పోస్టింగ్ చేశారు. ఇప్పటి వరకూ విజయనగరం సీసీఎస్‌లో పనిచేశారు. విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఫోర్తుటౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. స్టేషన్ సిబ్బంది ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షిస్తానని, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చట్టపరంగా చర్యలు చేపటాడతామన్నారు. అనంతరం స్టేషన్ పరసర ప్రాంతాలు పరిశీలించారు. అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పనిచేసిన సీఐ ఎస్.విజయకుమార్ రేంజ్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే.

వైభవుడికి కదంబం సమర్పణ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వైభవుడికి ప్రీతిపాత్రమైన కదంబం ప్రసాదాన్ని ఆదివారం సమర్పించారు. ముందుగా 4.30 గంటలకు గోదాదేవి అమ్మవారి ప్రతిమతో అర్చకులు శేషాచార్యులు, కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్, భక్తులు మేళతాళాల మధ్య ప్రదక్షిణ చేశారు. వైభవుడికి ప్రాతఃకాలార్చన అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామికి నక్షత్ర హారతి సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి అమ్మవారి తరపున శ్రీరంగనాథుడికి 7వ పాశురం చదివి వినిపించారు. ఈవో బండారు ప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వైభవుడికి ధనుర్మాసోత్సవాల్లో అత్యంత ప్రీతిపాత్రమైన కదంబం ప్రసాదాన్ని సమర్పించారు. ఈ ప్రసాదం ఆరోగ్య ప్రదాయిని కావడంతో స్వీకరించడానికి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ ప్రసాదం తయారీకి అవసరమైన రూ.50 వేలు వేంకటేశ్వర్లు, సరస్వతి దంపతులు సమకూర్చారు. ఈ సందర్భంగా వారిని ఆలయ ఈవో బండారు ప్రసాద్, అర్చకుడు శేషాచార్యులు ఘనంగా సత్కరించారు.


వేంకటేశ్వర్లు, సరస్వతి దంపతులను సత్కరిస్తున్న ఈవో ప్రసాద్, అర్చకుడు శేషాచార్యులు

బాలికల అక్రమ రవాణాపై నివేదిక అందించండి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా అనుమానాస్పదంగా వేరే ప్రాంతాలకు తీసుకెళ్తున్న 9 మంది మైనర్ బాలికలను ఇటీవల రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యవహారంలో పూర్తి వివరాలతో నివేదిక అందించాలని రైల్వే పోలీసులకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఆదివారం ఓ ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. పిల్లలను అక్రమంగా రవాణా చేస్తున్నారా..?, ఉపాధి పనుల నిమత్తమా..? అన్న విషయంపై, అలాగే సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు ఆలస్యంగా కేసు నమోదు చేశారా? లేక వెంటనే నమోదు చేశారా? సంబంధింత అంశాలతో నివేదిక అందజేయాలని కోరారు. నివేదిక ఆధారంగా కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేయనున్నట్లు సీతారాం తెలిపారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఫోర్తుటౌన్ సీఐ ఆత్మకూరు సత్యనారాయణ


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఫోర్తుటౌన్ సీఐ ఆత్మకూరు సత్యనారాయణ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలిముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం మత్తులో షాపుల వద్ద అల్లరి చేసినా, గొడవలకు పాల్పడినా, ఎవరినైనా బెదిరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందని, మంచి మార్గంలో నడవాలని సూచించారు.

- సమాజంలో అల్లర్లలో తలదూర్చకుండా రౌడీషీటర్లు ప్రశాంతంగా జీవించాలని ద్వారకా పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ వి.శ్రీనివాసరావు సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చొద్దన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న వామనమూర్తి

సీతంపేట : ప్రభుత్వం డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీతంపేటలో గల జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ ప్రజలకు సేవలందిస్తూ కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తున్న డ్రైవర్లు అనారోగ్యంతో మంచానపడి మరణిస్తే వారి కుటుంబం రోడ్డున పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లందరికీ ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. డ్రైవర్లకు భారీగా జరిమానాలు విధించే 21, 31 జీవోలను రద్దు చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ఇంధన, నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని కోరారు. వాహన మిత్ర వెంటనే విడుదల చేయాలని, డ్రైవర్ల పిల్లలకు స్కాలర్ షిప్‌లు, సొంతిళ్లు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ డ్రైవర్ల సమస్యలు అసెంబ్లీలో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాస్కర్, వెంకట్, దేవుడు, శివాజీ పాల్గొన్నారు.

మట్టి దిబ్బతో ఇక్కట్లు


రోడ్డు మధ్యలో వదిలేసిన మట్టిదిబ్బ

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధిలో గల సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్ ప్రాంతంలో కాలువ నిర్మాణం పనులు పూర్తయినప్పటికీ మట్టి అక్కడే వదిలేయడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గత నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో మట్టి దిబ్బలు కరిగి బురద నీరు రోడ్డుపైకి చేరుతోంది. రూ.2 లక్షల వ్యయంతో ఇక్కడ కొన్ని రోజులుగా కాలువ నిర్మాణ పనులు పూర్తి చేశారు. జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్ల పర్యవేక్షణలో పనులు పూర్తి చేశారు. అనంతరం మట్టి దిబ్బలు వదిలిపెట్టేశారు. సంబంధిత అధికారులు స్పందించి మట్టి దిబ్బ తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో బోగి మంట వేయొద్దు

లక్షా ఒక్క పిడకలతో నగరంలో బోగి మంట వేద్దాం

సీతమ్మధార : లక్షా ఒక్క పిడకలతో విశాఖ నగరంలో బోగి మంట వేద్దామని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం గురుద్వారా దరి కేశవ సేవా సమితి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న బోగి పండగను పర్యావరణ హితంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. పండగ పేరుతో టైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు కాల్చి పర్యావరణానికి హాని కలిగించొద్దని సూచించారు. మహా నగరంలో వేలాది ప్రదేశాల్లో టైర్లు, ప్లాస్టిక్‌తో బోగి మంటలు వేస్తే వెలువడే వాయు కాలుష్యం చాలా ప్రమాదకరమన్నారు. అలాగే బియ్యం పిండి, పసుపు, కుంకుమతో ముగ్గులు వేయాలని సూచించారు. గ్యాస్ పిండితో ముగ్గులు, రసాయన రంగులు, భార లోహాల రంగులతో ముగ్గులు అనారోగ్యకరమన్నారు. పర్యావరణ హితంగా బోగి పండగ చేసుకుని ఆరోగ్యంగా జీవిద్దామని సూచించారు. భారత్ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమార్ స్వామి మాట్లాడుతూ హరిదాసులు, గంగిరెద్దులు, బుడబుక్కల వాళ్లు, కొమ్ము దాసరలు, కోలాటం, తప్పెట గుళ్లు, పులి వేషాలు, దేశీయ నత్యాలతో పండగ నిర్వహించుకుందామన్నారు. సమావేశంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, కార్యదర్శి పాలెం నేచురల్స్, అశోక్ సత్యా నేచురల్స్ మధుసూదన్ రెడ్డి, గ్రీన్‌క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, తదితరులు

ఆలోచింపజేసిన ‘నిర్లక్ష్యమా.. నీ ఖరీదెంత’


నాటికలోని ఒక సన్నివేశంలో కళాకారులు

మురళీనగర్ : వాకర్స్ క్లబ్ నిర్వహించే సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన ‘నిర్లక్ష్యమా.. నీ ఖరీదెంత’ సాంఘిక నాటిక ఆహూతులను కడుపుబ్బా నవ్వించింది. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వరాజు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. సమాజంలోని సమస్యలు, నైతిక విలువలు, సాంఘిక సంబంధాలు, కుటుంబ జీవన సౌందర్యాన్ని ప్రతిబింబిస్తూ ఆహూతులను ఆలోచింపజేసింది. వామనరావుగా జి.కన్నబాబు, కుమార్‌గా పీవీ వరప్రసాద్, పల్లవిగా డి.హేమ, ఎస్ఐ పాపారావుగా చలసాని కృష్ణప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటరావుగా ఈటి రాంబాబు, చిరంజీవి అనురాధగా చిరంజీవి లాస్య నటించి ప్రేక్షకులను మెప్పించారు. వైఎస్‌కేఎస్ స్వామి నిర్వహణలో పీటీ మాధవ్ రచించిన ఈ నాటికకు చలసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వం వహించారు. పి.లీలామోహన్ సంగీతం అందించారు.